సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 51.342 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 51.342 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,250
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,005
3 శాతం జీఎస్టీతో	రూ.9,275
నవర (8 గ్రా)	రూ.74,200

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /28.0

జిల్లాలో ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 68 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

న్యాయాధికారులకు చట్టాలపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ శివశంకర్‌రావు

నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టులో శనివారం జిల్లా న్యాయమూర్తుల లిమిటేషన్ చట్టంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివ శంకరరావు, రాష్ట్ర న్యాయశాఖ మాజీ కార్యదర్శి జి.సత్య ప్రభాకర్‌రావు, జిల్లా జడ్జి జి.శ్రీనివాస్‌లు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయాధికారులకు లిమిటేషన్ చట్టం, నూతన చట్టాలపై వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. శివశంకరరావు, సత్య ప్రభాకరరావు, శ్రీనివాస్ లిమిటేషన్ చట్టంలోని అంశాల గురించి వివరించారు. చట్టాల్లోని పలు అంశాలను చర్చించారు. పలుచట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



స్టేడియంలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న వాకర్స్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పహల్గాం మృతులకు నివాళిగా వాకర్స్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి స్టేడియంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వేలూరు రంగారావు, కనకట్ల రఘురాం ముదిరాజ్, అరిగల సాయిరాం, కిలారి తిరుపతి నాయుడు, బాసం శేషగిరిరావు, సేగు రమేష్, బలరామయ్య నాయుడు, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వసుంధర దేవి, ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, నారాయణ రెడ్డి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఒంగోలు నరసయ్య, దద్దోల రమణయ్య గౌడ్, సురేంద్ర ప్రకాష్, భాగవతుల రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మంత్రి ఆనం సమీక్ష



కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

నెల్లూరు రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మకూరు పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. శనివారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో మంత్రి ఆనం సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ మే 1న సీఎం పర్యటన రూట్ మ్యాప్, కార్యక్రమ వివరాలు, బందోబస్తు తదితర అంశాలను ప్రధానంగా చర్చించారు. నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు పైలాన్ ఆవిష్కరణ, ప్రజావేదిక ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యాలయ మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ, యువతతో ముఖాముఖి ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో బందోబస్తుపై ఎస్పీతో మంత్రి చర్చించారు.

జీఓ నెం.35ను సవరించాలి

- పంచాయతీరాజ్ ఉద్యోగుల డిమాండ్



నెల్లూరు (పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ద్వారా విడుదల చేసిన జీఓ నెం.35ను సవరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం జెడ్పీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.35 వల్ల జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగులకు గుదిబండగా మారిందన్నారు. ఆ జీవో వల్ల పనిచేస్తున్న ఉద్యోగులు అదే హోదాలో పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీని వలన ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు ఇబ్బందిగా మారిన జీవో నెం.35ను సవరించేలా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా సెంట్రల్ బ్యాంకు (ఉమ్మడి జిల్లా) చైర్మన్ కుర్చీ కోసం ముగ్గురు కీలక నేతలు కుస్తీ పడుతున్నారు. 'ఎమ్మెల్సీ, ఎంపీ వర్సెస్ ఓ మంత్రి' అనే రీతిలో అధికార పార్టీలో అంతర్గత పోరు నడుస్తోంది. ప్రొటోకాల్ హోదా ఉన్న పదవి కావడంతో తమ అనుచరులకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. ఎవరికి వారు మంత్రి నారాయణ, ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకునేందుకు వ్యూహాలు అమలు చేస్తున్నారు.



డీసీసీబీ కుర్చీ కోసం కుస్తీ

మంత్రి ఆనం ✕ ఎంపీ వేమిరెడ్డి

- మెట్టుకూరు కోసం ఆనం పట్టు
- మాలేపాటి వైపు బీద, వేమిరెడ్డి
- మంత్రి నారాయణ మద్దతుకు ఇరుపక్షాల యత్నాలు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లా టీడీపీలో డీసీసీబీ చైర్మన్ పోస్టు కాక పుట్టిస్తోంది. ప్రొటోకాల్ ఉన్న పోస్టు కావడంతో డిమాండ్ పెరిగింది. గతంలో సెంట్రల్ బ్యాంకు చైర్మన్‌గా పనిచేసిన మెట్టుకూరు ధనంజయరెడ్డికి కట్టబెట్టాలని మంత్రి ఆనం, దగదర్తికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడికి ఇవ్వాలని ఎంపీ వేమిరెడ్డితో జతకట్టిన బీద రవిచంద్ర పట్టుబడుతున్నారు. ఈ సీటు వ్యవహారం పార్టీలో రాజకీయ కుంపటికి దారి తీసే అవకాశం కనిపిస్తోంది.

నివురు గప్పిన నిప్పులా..

జిల్లాలో అధికార పార్టీలో అంతర్గత వైషమ్యాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉన్నారు. ఇద్దరు మంత్రులది చేరో దారి. ఇసుక టెండర్ల వ్యవహారంలో ఇద్దరి మధ్య ఆధిపత్యం కొనసాగుతోంది. డీఆర్‌సీ సమావేశం నాటి నుంచి ఎంపీకి, ఇద్దరు మంత్రులతో పొసగని పరిస్థితి. ఇక మంత్రి ఆనంకు, ఎమ్మెల్సీ బీద మధ్య ఆధిపత్య అగాధం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేల పరిస్థితి చూస్తే.. ఎంపీ వేమిరెడ్డితో పలువురు ఎమ్మెల్యేలతో రాజకీయంగా సఖ్యత లేదు. సైదాపురం, ఉదయగిరిలోని క్వార్ట్జ గనుల వ్యవహారమే ఈ పరిస్థితికి కారణంగా చెప్పొచ్చు. శత్రువును శత్రువుతోనే జయించాలనే కోణంలో డీసీసీబీ చైర్మన్ విషయంలో మంత్రి ఆనంకు కావలి ఎమ్మెల్యే జైకొడుతున్నారు. మంత్రి ఆనంకు ఉదయగిరి ఎమ్మెల్యే మధ్య ఇటీవల గ్రావెల్ రవాణా వ్యవహారంపై నిప్పు.. ఉప్పులా ఉంది. ఇక సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు ఈ విషయంలో తటస్థంగా ఉండనున్నారు. చివరగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేనే రాజు.. నేనే మంత్రి అనే విధంగా ఉన్నారు.

ఆనంకు చెక్ పెట్టేందుకేనా?

ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోస్టుతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి చెక్ పెట్టేందుకే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర వ్యూహ రచన చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. బీదకు మరో మంత్రి నారాయణ అండ ఉండనే ఉంది. డీసీసీబీ చైర్మన్ పదవిని భర్తీ చేసేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మంత్రి ఆనం తన ముఖ్య అనుచరుడు, ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరుకు కట్టబెట్టాలని పావులు కదుపుతున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ బీద తన సొంత నియోజకవర్గానికి చెందిన తన ముఖ్య అనుచరుడు, వ్యాపార పార్టనర్ అయిన మాలేపాటి సుబ్బానాయుడుకి ఆ పోస్టు దక్కేలా పావులు కదుపుతున్నారు. గతంలో కావలిలో పార్టీకి వెనుదన్నుగా నిలిచిన మాలేపాటికే ఎమ్మెల్యే టికెట్ వస్తుందని అంతా ప్రచారం జరిగింది. చివరి క్షణంలో దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆ సీటు దక్కించుకుని ఎమ్మెల్యే అయ్యాడు. తనకు దక్కాల్సిన అవకాశాన్ని తన్నుకుపోయాడని మాలేపాటికి, ఎమ్మెల్యే మధ్య ప్రత్యక్ష వార్ నడుస్తోంది. మాలేపాటిని కావలి ఎమ్మెల్యే రాజకీయంగా తొక్కడంతోపాటు కేసులతో వేధింపులకు గురి చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో బీదకు ఎమ్మెల్సీ పదవి దక్కడంతో కావలిపై బీదకు పట్టు పెరిగింది. తన వ్యతిరేక వర్గాన్ని బీద కూడగడుతున్నారని ఎమ్మెల్యే కావ్య లోలోన రగిలిపోతున్నాడు. ఈ నేపథ్యంలో బీద తన ముఖ్య అనుచరుడు, పార్టీ విధేయుడు అయిన మాలేపాటికి డీసీసీబీ చైర్మన్ పదవి కట్టబెట్టాలని వ్యూహాత్మకంగా ఎంపీ వేమిరెడ్డి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు.

పంతం నెగ్గేందుకు..

సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మంత్రి ఆనంకు సన్నిహితుడు. ఉమ్మడి జిల్లా పరిధిలోని డీసీసీబీని తన చేతుల్లో పెట్టుకునేందుకు ఆనం వ్యూహాత్మకంగా మెట్టుకూరుకు ఆ సీటు కట్టబెట్టేందుకు వ్యూహ రచన చేస్తున్నారు. జిల్లా ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వచ్చే నెల 1న ఆత్మకూరులో సీఎం చంద్రబాబు పర్యటన ఖరారు కానున్న నేపథ్యంలో అక్కడ అన్నీ తానై మెట్టుకూరు వ్యవహరిస్తున్నాడన్న ప్రచారం లేకపోలేదు. ఇదిలా ఉంటే టీడీపీ అధిష్టానం మాత్రం నామినేటెడ్ పోస్టుల ఎంపిక విధానంలో పార్టీ విధేయతనే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోకేశ్ ఎన్నికల వేళ వచ్చిన నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వమని చెప్పారు. ఆ నిర్ణయం పరంగా చూస్తే మెట్టుకూరికి పదవి వరిస్తుందా? అనేది సంశయంగా ఉంది. అధిష్టానం వద్ద బీదతో పాటు ఎంపీ వేమిరెడ్డికి పరపతి ఉండడం, మాలేపాటి విషయంలో ఒక దఫా అన్యాయం జరిగిన నేపథ్యంలో వీరి ప్రతిపాదనకే మొగ్గే చూపే అవకాశాలు ఉంటాయని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. మరి మంత్రి ఆనం తన అనుచరుడికి ఆ పదవి ఇప్పించుకునేందుకు ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తాడో వేచి చూడాల్సిందే.

పామాయిల్ చోరీ

పచ్చదొంగల పనేనా!

- సూత్రధారులను వదిలేసి డ్రైవర్‌పై కేసు
- చోరీచేసిన పామాయిల్ పిడుగురాళ్లలో విక్రయం
- నిందితులంతా వెంకటాచలం వారే
- కేసు దర్యాప్తును పక్కదారి పట్టించే యత్నం



కాలువలో పామాయిల్ ట్యాంకర్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రూ.లక్షలు విలువ చేసే పామాయిల్ దొంగతనం కేసు పక్కదారి పడుతోంది. అధికార పార్టీకి చెందిన కొందరు పామాయిల్ ట్యాంకరు నుంచి ఆయిల్ దొంగిలించి ప్రమాదంగా చిత్రీకరించి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో తెరవెనుక నేరాలకు అలవాటు పడిన అధికార పార్టీకి చెందిన వారు ఉన్నారని, పోలీసు దర్యాప్తులో వారు బయటపడకుండా తప్పించుకునేందుకు పావులు కదుపుతున్నారని సమాచారం. ఆయిల్ ట్యాంకర్ ప్రమాదానికి గురై ఆయిల్ కాలువలో కొట్టుకుపోయినట్టు చిత్రీకరించి పల్నాడు జిల్లాలో మరో ట్యాంకర్ ద్వారా విక్రయించి రూ.లక్షలు సొమ్ము చేసుకున్నారని తెలుస్తోంది. రాజకీయ పలుకుబడి ఉండడం వల్ల పోలీసులు సైతం దర్యాప్తును నిక్కచ్చిగా చేపట్టలేక పోతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయిల్ చోరీలో పాత నేరస్తుల హస్తం

ముత్తుకూరు మండలంలోని ఓ పామాయిల్ పరిశ్రమ నుంచి 23.5 టన్నుల పామాయిల్ లోడుతో బయలుదేరిన ట్యాంకర్ నుంచి ఆయిల్ చోరీకి పాల్పడిన వారు పాత నేరస్తులేనని తెలుస్తోంది. వీరు రూ.43 లక్షల విలువైన పామాయిల్‌ను పక్కదారి పట్టించి పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో విక్రయించారు. ఈ పామాయిల్ దొంగతనానికి పాల్పడిన వారంతా సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలానికి చెందినవారు. డ్రైవర్ మొలకడిపూడి గ్రామానికి చెందిన వాడు కాగా ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి కూడా ఈ నేరంలో ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటాచలంకు చెందిన అధికార పార్టీకి చెందిన నాయకుడినని చెప్పుకునే వ్యక్తికి గతంలో నేర చరిత్ర ఉన్నట్టు తెలుస్తోంది. ఈయన రెండు మాసాల క్రితం తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి నుంచి బంగారం అక్రమంగా తీసుకొచ్చి నెల్లూరులో విక్రయిస్తూ పట్టుబడి, నానాతంటాలు పడి అందులో నుంచి బయటపడినట్టు తెలుస్తోంది. పామాయిల్ మాయంలోనూ ఇతనే ప్రధాన పాత్ర పోషించినట్టు చెప్పుకుంటున్నారు.

కేసు పక్కదారి పట్టించే యత్నం

పామాయిల్ దొంగతనం కేసులో అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఉండడం వల్ల కేసు పక్కదారి పట్టే యత్నం జరుగుతున్నట్టు తెలుస్తోంది. ముత్తుకూరు పోలీసులు ఫ్యాక్టరీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మూడు రోజులుగా ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసుల దర్యాప్తు పక్కదారి పట్టిందనే ప్రచారం జరుగుతోంది. ఆయిల్ కొనుగోలు చేసిన పిడుగురాళ్లకు కూడా వెళ్లి విచారణ నిర్వహించారు. దీంతో నిందితులు బయటపడడం, వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు కేసును నీరుగార్చుతారా? లేక అసలు దోషులను అరెస్ట్ చూపుతారా? అనే చర్చ జరుగుతోంది. ముత్తుకూరు పామాయిల్ ఫ్యాక్టరీల్లో ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నా పోలీసులు చెక్ పెట్టలేకపోతున్నారు. ఈ పర్యాయం కాస్త విభిన్నంగా చోరీకి పాల్పడిన వారు ట్యాంకరును కాలువలో తోసి ప్రమాదంగా చిత్రీకరించి మరో ట్యాంకరుకు ఆయిల్ నింపుకుని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.

విద్యుత్ ఫీడర్ల ఎనర్జీని ఆడిట్ చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీజీఎం ఆదిశేషయ్య

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లాలోని ప్రతి ఒక్క విద్యుత్ ఫీడర్ ఎనర్జీని ఖచ్చితంగా ఆడిట్ చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్య అధికారులను ఆదేశించారు. నెల్లూరు వచ్చిన ఆయన విద్యుత్ భవన్‌లో జిల్లా అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ లైన్‌లాస్ ఎక్కువ ఉందని వెంటనే తగ్గించాలని, ఎనర్జీ ఆడిట్‌పై అధికారులు సమీక్ష చేయకపోతే విద్యుత్ సంస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. జిల్లాలోని 8వేల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మే నెల 31 లోపు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక విద్యుత్ ఫీడర్ ద్వారా ఎంత విద్యుత్ పంపిణీ అవుతోంది, ఆ మేరకు రెవెన్యూ వస్తుందా లేదా అనేది ఎనర్జీ ఆడిట్ ద్వారా మాత్రమే తెలుసుకోవచ్చని అన్నారు. సమావేశంలో జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, జిల్లా సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు

నెల్లూరు (టౌన్): 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి గోదాముల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా జిల్లాలోని ఎమ్మార్సీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలను తరలిస్తున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు తెలిపారు. శనివారం పాఠ్యపుస్తకాలతో వెళుతున్న బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సెమిస్టర్–1కు సంబంధించి 10,23,718 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. పాఠశాలల పునః ప్రారంభం రోజున వాటిని అందజేస్తామన్నారు.

సైబర్ ముఠా

గుట్టు రట్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- రూ.2 లక్షల నగదు, మొబైల్స్ స్వాధీనం
- బ్యాంకు ఖాతాల్లోని రూ.39 లక్షలు ఫ్రీజ్

నెల్లూరు(క్రైమ్): షేర్స్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.కోట్లు దోచేస్తున్న అంతర్ రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2లక్షల నగదు, 50 మొబైల్స్, ఏటీఎం కార్డులు, ప్రింటర్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాల్లోని రూ.39.40 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ జి.కృష్ణకాంత్ నిందితుల వివరాలను శనివారం వెల్లడించారు. నగరంలోని పొగతోటకు చెందిన ఓ మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన లింక్‌రాగా క్లిక్ చేసింది. వెంటనే ఆమె వాట్సాప్ నంబర్‌కు నిషాబసు అనే మహిళ మెసేజ్ చేసి ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించి సూచనలు, సలహాలిచ్చి లాభాలు వచ్చేటట్లు చేస్తామని నమ్మబలికి బాధిత మహిళచే యాప్ ఇన్‌స్టాల్ చేయించింది. షేర్ల కొనుగోలుకు కొంత మొత్తం పెట్టుబడి పెట్టించి ఆదాయం వచ్చేలా చేసి ఆమెను నమ్మించింది. సదరు మహిళ అప్పుచేసి ఈ ఏడాది జనవరి 23వ తేదీ నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు పలు దఫాలుగా రూ.2,46,30,396 డిపాజిట్ చేశారు. వారు అకౌంట్‌లో రూ.4,02,24,759 నగదు ఉన్నట్లు ఆమెకు చూపించారు. ఆ నగదు డ్రా చేసేందుకు యత్నించగా అవి రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు గతనెల 9వ తేదీన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. బాధిత మహిళ డిపాజిట్ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా నిందితులు రాజస్థాన్‌కు చెందిన రామారామ్, అతని అనుచరులైన గోగారామ్, హేమంత్‌కుమార్, కైలాష్, నాగారం, హైదరాబాద్‌కు చెందిన వీరేశ్వరరావు, ఎం.రవిలుగా గుర్తించి వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాజస్థాన్‌కు చెందిన ఐదుగురు నిందితులను ఈనెల 25న, మిగిలిన ఇద్దరిని శనివారం అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా మోసాలు వెలుగులోకి వచ్చాయి.

మోసాలు ఇలా..

రాజస్థాన్‌కు చెందిన రామారామ్ అతని అనుచరులు నాలుగు నెలల కిందట చెన్నైకు వచ్చారు. వీరంతా ఓ గదిని అద్దెకు తీసుకుని శివం మెటల్ కార్పొరేషన్, సూర్య ఇంపెక్స్ తదితర నకిలీ కంపెనీల పేర్లతో వివిధ బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు, ప్రధాన బ్యాంకులు కాకుండా చిన్న చిన్న బ్యాంకుల్లో క్షేత్రస్థాయిల్లో పరిశీలన ఉండని బ్యాంకుల్లో సేవింగ్స్ ఖాతాలు తెరిచారు. రోడ్ల పక్కన విక్రయించే సిమ్‌కార్డులు తీసుకుని వాటి ద్వారా నకిలీ ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు ఏర్పాటు చేసి ఆ నంబర్లకు అనుసంధానం చేశారు. ఈ మొత్తం ప్రక్రియకు అవసరమైన ప్రింటర్లు, ఏటీఎం కార్డులు, ల్యాప్‌టాప్, కార్డ్ కటింగ్‌మిషన్, లామినేషన్ యంత్రం, స్మార్ట్ ఫోన్లు, కీప్యాడ్ ఫోన్లు తదితరాలను ఏర్పాటు చేసుకున్నారు. దీనికోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక ఆదాయం వస్తుందని అనేకమందిని నమ్మించి కోట్లు దోచేస్తున్నారు. ఇప్పటి వరకు నకిలీ గుర్తింపు కార్డులతో 236 బ్యాంకు ఖాతాలు తెరవగా వాటిలో 36 ఖాతాలపై ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో 436 ఫిర్యాదులు అందాయి. వారి వద్ద నుంచి రూ.2లక్షల నగదు, సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు, ప్రింటర్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా కొందరు నిందితులు ఉన్నారని వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు.

సిబ్బందికి అభినందన

సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసిన చిన్నబజారు, సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చిన్నబజారు ఎస్ఐలు అయ్యప్ప, రజాక్, ఏఎస్ఐ శ్రీహరి, హెచ్‌సీలు సురేష్‌బాబు, నజ్మల్, కానిస్టేబుల్స్‌ను, సైబర్ వింగ్ పీసీలను ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

సమగ్రశిక్షలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న పోస్టులకు మే నెల 3వ తేదీలోపు అర్హులైన ఆసక్తి గల సెకండరీ గ్రేడు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీసీ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లానింగ్ ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఏఎస్ఓ, ఏఎంఓ (ఉర్దూ), అసిస్టెంట్ ఏఎల్ఎస్ కోఆర్డినేటర్, ఐఈ కోఆర్డినేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

క్లుప్తంగా

'డీకేడబ్ల్యూ'లో జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను శనివారం నిర్వహించారు. రాత పరీక్ష, ఆపై ఇంటర్వ్యూలను జరపగా, 78 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. జేకేసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఖాతాల్లో నగదు జమ


నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న జేడీ తదితరులు

నెల్లూరు రూరల్: మత్స్యకారుల సేవలో పథకం ద్వారా జిల్లాలోని 12,239 మంది మత్స్యకారులకు రూ.24.47 కోట్లను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని మత్స్యశాఖ జిల్లా జేడీ నాగేశ్వరరావు తెలిపారు. పథకాన్ని శ్రీకాకుళం జిల్లాలో సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి వర్చువల్‌గా వీక్షించిన అనంతరం జేడీ మాట్లాడారు. వేట నిషేధ కాలంలో భృతిగా రూ.20 వేలను విడుదల చేశారని చెప్పారు. కావలి నియోజకవర్గంలో 4778 మంది, కోవూరులో 3102 మంది, సర్వేపల్లిలో 1887 మంది, కందుకూరులో 2472 మందికి ఈ భృతిని అందజేశారని వివరించారు. మత్స్యశాఖ అధికారులు చాంద్‌బాషా, శ్రీనివాసులు, మత్స్యకార సంఘ నేతలు కొండూరు పాలిశెట్టి, పామంజి శేషయ్య, కొమారి విజయమ్మ, రామాని నారాయణ, భక్తాని శ్రీను, ఆవల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకమంటూ నగదు కొట్టేశారు

• గృహిణికి సైబర్ నేరగాళ్ల టోకరా

కావలి: ప్రభుత్వ పథకానికి సంబంధించిన నగదును జమచేస్తామంటూ పట్టణంలో ఓ గృహిణికి సైబర్ నేరగాళ్లు టోకరా వేసి రూ.71 వేలను కొట్టేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. సంక్షేమ పథకానికి సంబంధించిన నగదును జమ చేస్తామంటూ పట్టణానికి చెందిన భాను అనే గృహిణికి ఓ నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తొలుత ఓ పురుషుడు మాట్లాడి, ఆపై ఓ మహిళకు కాల్‌ను బదిలీ చేశారు. భానుతో మాటలు కలిపి, వాట్సాప్ కాల్ చేస్తానని, లిఫ్ట్ చేయాలని సూచించారు. వెంటనే మరో నంబర్ నుంచి ఫోన్ చేసి, క్యూఆర్ కోడ్ పంపుతానని దాన్ని ఓకే చేయగానే, ఖాతాలో నగదు జమవుతుందని చెప్పారు. మొదటిసారి పంపిన క్యూఆర్ కోడ్‌ను భాను ఓకే చేసినా, ఏదో సాంకేతిక సమస్య తలెత్తినట్లుగా అవతలి ఫోన్లో ఉన్న మహిళ మభ్య పెట్టారు. ఇలా ఆరుసార్లు పంపగా, ఓకే క్లిక్ చేశారు. ఈ తరుణంలో తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.71 వేలు కట్ అయినట్లు భాను ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో వెంటనే తనకు ఫోన్ వచ్చిన నంబర్‌కు కాల్ చేయగా, మనుగడలో లేదనే సమాధానం వచ్చింది. జరిగిన వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి కన్నీటిపర్యంతయ్యారు. ఘటనపై కావలి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	112
లేయర్ (లైవ్)	100
బ్రాయిలర్ చికెన్	204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	224
లేయర్ చికెన్	170

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి	రూ.105
సన్నవి	రూ.80
పండ్లు	రూ.50

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, KOVUR.
I.P. No. 7/2025

RACHAMADUGU HARI KRISHNA... Petitioner.
Vs
1.CHEJARLA SEENU
2. MALIREDDY VIJAYAMMA...... Respondents.

జనరల్ నోటీసు

పై తెలిపిన పిటిషన్‌లో పిటిషనరు 1వ రెస్పాండెంటును ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని మరియు 1వ రెస్పాండెంట్ 2వ రెస్పాండెంట్ పేరిటకి [illegible] ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన రిజిష్టర్డు విక్రయపత్రం తేది 31-01-2025 దాఖ్యుమెంటు నెం 430/2025 (SRO, Kovur) రును రద్దు పర్చుమని కోరుతూ పై తెలిపిన కోర్టులో I.P.No.7/2025ను దాఖలు చేసియున్నందున, సదరు I.P పై ఎవ్వరికైనను అక్షేపణలు ఉన్న యెడల తేది. 08-05-2025న ఉదయం 10:30 గంటలకు పై తెలిపిన కోర్టులో హాజరై అక్షేపణలు తెలుపుకోవలసినదిగా యిందు మూలముగా తెలియజేయడమైనది.

పిటిషన్ ఆస్తి షెడ్యూలు

[illegible]

P. వాసుదేవ, M.C.A.,B.L.,
పిటిషనరు తరఫు అడ్వకేట్, నెల్లూరు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

• రూ.ఏడు లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ఆత్మకూరు: నగల దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో వివరాలను డీఎస్పీ వేణుగోపాల్ శనివారం వెల్లడించారు. పట్టణంలోని బంగారు నగల దుకాణ యజమాని రమణమూర్తి గత నెల 31వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో షాపును మూసేందుకు ఉపక్రమించారు. ఈ తరుణంలో తన చేతిలోని నగల సంచిని పక్కన పెట్టి తలుపులేస్తుండగా, అక్కడే ఉన్న ఓ యువకుడు తస్కరించి అప్పటికే బైక్‌తో సిద్ధంగా వ్యక్తితో కలిసి ఉడాయించారు. దుకాణాదారుడు గమనించేలోపు వారు పరారయ్యారు. అక్కడే ఉన్న కొందరు యువకులు వారిని బైక్‌లపై వెంబడించినా ప్రయోజనం లభించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ గంగాధర్ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు జరిపారు. ఎన్టీఆర్ జిల్లా గుడివాడలోని చర్చి సెంటర్‌కు చెందిన బొంతు మంగయ్య, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన ఓటేరు సాయిని నిందితులుగా గుర్తించారు. బోయలచిరివెళ్ల వద్ద వీరు సంచరిస్తుండగా, అదుపులోకి తీసుకున్నారు. చిన్నపిల్లల కమ్మలు, బ్రాస్‌లెట్లు 50 గ్రాముల బంగారం.. 61 జతల వెండి గొలుసులు.. మొత్తం రూ.ఏడు లక్షలు విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ప్రతిభ చూపిన సీఐ, ఎస్సైలు జిలానీ, సాయిప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది గిరిధర్, చెన్నకేశవులు, శ్రీనివాసులురెడ్డి, విజయ్, సతీష్, షరీఫ్, అశోక్, అలీ, తదితరులను అభినందించారు. వీరికి రివార్డులను ఎస్పీ ద్వారా అందజేయనున్నామన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు


స్వాధీనం చేసుకున్న సొత్తు

మద్యం మత్తులో జనసేన నేత వీరంగం

• తండ్రీకొడుకుపై అకారణంగా దాడి
• రాస్తారోకో, ఆందోళన చేపట్టిన గ్రామస్తులు


బాధితుడు శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: మద్యం మత్తులో జనసేన నేత వీరంగం సృష్టించిన ఘటన కలిగిరిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పాతూరుకు చెందిన జనసేన మండల కన్వీనర్ బండారు లక్ష్మీనారాయణ మద్యం మత్తులో.. రోడ్డుపై ఉన్న జిర్రావారిపాళేనికి చెందిన తండ్రీకొడుకు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చంద్రారెడ్డిపై కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కలిగిరిలోని ఒక చిల్లర దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డికి సౌమ్యుడిగా మంచి పేరు ఉంది. దీంతో అతని స్వగ్రామంతో పాటు కలిగిరి నుంచి బంధుమిత్రులు, గ్రామస్తులు సుమారు 200 మందికిపైగా పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. లక్ష్మీనారాయణను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అర్ధరాత్రి రెండు గంటల వరకు నిరసన చేపట్టారు. దీంతో సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి లక్ష్మీనారాయణ పలువురిపై దాడులకు తరచూ పాల్పడుతున్నారని ఆరోపించారు. అతనికి భయపడి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంలేదని చెప్పారు. కాగా లక్ష్మీనారాయణపై చట్టపరమైన చర్యలు చేపడతామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. జిర్రావారిపాళెం గ్రామస్తులతో పోలీస్‌స్టేషన్లో శనివారం మరోసారి చర్చించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


కలిగిరిలో జిర్రావారిపాళెం గ్రామస్తుల రాస్తారోకో

అక్రమ మైనింగ్‌పై చర్యలకు డిమాండ్

• ఫిర్యాదుదారుపై డీడీ రుసరుసలు


వినతిపత్రమిస్తున్న శిరీషా

నెల్లూరు (టౌన్): సైదాపురం మండలంలోని క్వార్ట్జ్ గనుల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు చేపట్టాలని రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరీషా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆటోనగర్‌లోని మైనింగ్ కార్యాలయంలో డీడీ బాలాజీనాయక్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. లీజు ముగిసినా పలు క్వార్ట్జ్ గనుల్లో అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. నిల్వ ఉన్న వాటిని తరలించేందుకు అనుమతిస్తే, అక్రమంగా తవ్వుతున్నారని చెప్పారు. సిద్ధి వినాయక మైన్స్‌లో జిలెటిన్‌ను ఉపయోగించి ప్రమాదకరంగా బ్లాస్టింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. భారీగా ముడుపులు తీసుకుంటూ అక్రమ మైనింగ్, బ్లాస్టింగ్‌తో తమకేమీ సంబంధం ఉందంటూ సదరు అధికారి ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శోభారాణి మైనింగ్‌పై రూ.32 కోట్ల డిమాండ్ నోటీస్ ఉందన్నారు. ఏడీగా బాలాజీనాయక్ ఉన్న సమయంలో 32 వేల టన్నుల స్టాక్‌ను చూపించారని, ఆయన డీడీగా వచ్చినప్పుడు 1.25 లక్షల టన్నుల మెటీరియల్ నిల్వ ఉందని చెప్పుండటంపై అనుమానం వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని వివరించారు.

దబాయింపు ధోరణి

పొట్టేళ్ల శిరీషాపై డీడీ బాలాజీనాయక్ రుసరుసలాడారు. అక్రమ మైనింగ్, బ్లాస్టింగ్‌పై తమకే సంబంధం లేదంటూ దబాయించారు. మీడియా ముందు తన పేరును ఎందుకు ప్రస్తావించారంటూ రుసురుసలాడారు. ఫిర్యాదు చేశారు కాబట్టి విచారణ చేపడతామని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలన్నారు.

పుట్టెడు దుఖంలో ఉన్నా.. కనికరం లేకుండా

• ఇంట్లోంచి వృద్ధురాలి గెంటివేత


బాధితురాలు రమణమ్మ

మనుబోలు: భర్త చనిపోయి పుట్టెడు దుఖంలో ఉన్న వృద్ధురాలిపై జాలి, దయా లేకుండా సొంత మరిదే ఇంటి నుంచి గెంటేసి తాళమేసిన ఘటన మండలంలోని వడ్లపూడిలో చోటుచేసుకుంది. బాధితురాలి సోదరుడి ఫిర్యాదుతో ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. వడ్లపూడికి చెందిన వృద్ధ దంపతులు రావూరి రాఘవయ్య, రమణమ్మ దంపతుల ఏకైక కుమార్తె చనిపోయారు. దీంతో వీరి ఆలనాపాలనను నెల్లూరులో నివాసం ఉంటున్న ఆయన సోదరుడు చంద్రయ్య చూసేవారు. ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో రాఘవయ్య ఇటీవలే తన పొలాన్ని విక్రయించారు. వచ్చిన సొమ్ములో కొంత వెచ్చించి నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. మిగిలిన నగదును సోదరుడి వద్ద ఉంచారు. ఈ తరుణంలో ఈ నెల ఆరున రాఘవయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆ తర్వాత రెండు కుటుంబాల మధ్య ఏమి జరిగిందో గానీ రావూరి రమణమ్మను ఇంటి నుంచి చంద్రయ్య మూడు రోజుల క్రితం గెంటేసి తాళమేశారు. ఇప్పటికే కాలు విరిగి మంచం పట్టిన రమణమ్మ పరిస్థితి దయనీయంగా మారింది. ఇంటి బయటే ఉంటూ ఇరుగుపొరుగు వారు పెట్టే అన్నం తింటూ కడుపు నింపుకొంటున్నారు. విషయం తెలుసుకున్న వెంకటాచలం మండలం కురిచెర్లపాడుకు చెందిన ఆమె సోదరుడు రామకృష్ణనాయుడు మనుబోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అనుమానాస్పద మృతి

కొండాపురం: బాలిక అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కొండాపురంలోని ఎస్సీ కాలనీలో శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. రావూరి ఆనంద్, మాధవి దంపతుల మధ్య చిన్నపాటి వివాదాలున్నాయి. ఈ క్రమంలో తన ముగ్గురు పిల్లలతో కలిసి ప్రకాశం జిల్లా పోకూరులో ఆమె ఉంటున్నారు. తల్లి వద్ద ఉంటూ సుప్రజ (11) చదువుకోసాగారు. సెలవులివ్వడంతో కొండాపురంలోని తండ్రి ఆనంద్ ఇంటికొచ్చారు. ఈ క్రమంలో పనినిమిత్తం ఆనంద్ శుక్రవారం బయటకెళ్లారు. తిరిగొచ్చేసరికి ఇంట్లో ఉరేసుకొని సుప్రజ మృతి చెంది ఉండటాన్ని గమనించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న కలిగిరి సీఐ వెంకటనారాయణ, కలిగిరి ఇన్‌చార్జి ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

స్మార్ట్ స్ట్రీట్ త్వరలో ప్రారంభం


శిక్షణ పొందిన వారితో మంత్రి నారాయణ తదితరులు

నెల్లూరు(బారకాసు): ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే సీఎం ఆశయాలకు అనుగుణంగా నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌ను త్వరలో ప్రారంభించనున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా స్మార్ట్ స్ట్రీట్ వెండార్లకు నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమ ముగింపు సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. మొదటి దశలో 163 మంది వీధి వ్యాపారులను ఎంపిక చేసి వారితో స్మార్ట్ బజార్లను నిర్వహించనున్నామని చెప్పారు. దీనికి అవసరమైన సబ్సిడీలు, రుణాలు, సోలార్ పవర్‌ను అందజేయడమే కాకుండా వారికి వ్యాపారంలో మెళకువలు తెలియజేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని వెల్లడించారు. ప్రస్తుతం ఎంపిక చేసిన 163 మందికి బ్యాచ్‌ల వారీగా కంప్యూటర్‌లో ప్రాథమిక శిక్షణను సైతం అందిస్తామన్నారు. అనంతరం వెండార్లకు సర్టిఫికెట్లు, యూనిఫారాన్ని అందజేశారు. కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ, అడిషనల్ మిషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, స్టేట్ మిషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సుధీర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా తనువు చాలించి

• వేర్వేరు ఘటనల్లో ఇద్దరి బలవన్మరణం

జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నెల్లూరులో ఓ వివాహిత.. అవమానభారంతో కొండాపురంలో ఓ వ్యక్తి బలవనర్మణం చెందారు. ఈ ఘటనలు ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి.

వివాహిత ఆత్మహత్య


నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదుగానీ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాలాజీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రాంతానికి చెందిన కృష్ణ, గోమతి (31) దంపతులకు ఇద్దరు కుమారులు. నగరంలోని ఓ పెట్రోల్ బంకులో కృష్ణ.. క్యాటరింగ్‌లో పనులు చేసుకుంటూ గోమతి జీవనం సాగిస్తున్నారు. మనస్పర్థల నేపథ్యంలో తన స్వగ్రామమైన దగదర్తిలో ఉంటూ భార్య, పిల్లల వద్దకు అప్పుడప్పుడూ ఆయన వచ్చివెళ్లేవారు. కొంతకాలంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె తన ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కృష్ణ, గోమతి పుట్టింటివారికి సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆమె మృతి చెందారు. ఘటనపై సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఎస్సై విజయశ్రీనివాస్.. హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అవమానాన్ని తట్టుకోలేక..


నాగరాజు (ఫైల్)

కొండాపురం: అవమానాన్ని తట్టుకోలేక కొండాపురం మండలంలోని కొమ్మిపాళేనికి చెందిన నాగరాజు (40) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుపతిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడి బంధువుల వివరాల మేరకు.. బేల్దారి పనుల నిమిత్తం తిరుపతిలో నాగరాజు ఉంటున్నారు. ఇటీవల ఆయన తమ్ముడు పోతురాజు దగదర్తికి చెందిన ఓ వివాహితను తీసుకొని ఆయన ఇంటికెళ్లారు. విషయం తెలుసుకున్న మహిళ బంధువులు తిరుపతి వెళ్లి అక్కడ గొడవ చేసి.. పోలీస్‌స్టేషన్లో పంచాయితీ పెట్టారు. ఈ ఘటనను తలవంపుగా భావించిన ఆయన ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

నేర నియంత్రణకే కార్డన్ అండ్ సెర్చ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

కావలి: నేర నియంత్రణకే కార్డన్ అండ్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నామని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంకుల ఫ్యాక్టరీ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్‌ను శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇంట్లోని వ్యక్తుల ఆధార్ కార్డులతో పాటు వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని 55 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలను సీజ్ చేశారు. సీఐలు గిరిబాబు, రాజేశ్వరరావు, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.